## క్లుప్తంగా

### సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : కొడవలూరు మండలం గన్నవరం గ్రామానికి చెందిన దగ్గుమాటి తిరుమలరెడ్డికి రూ.3.50 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు మంజూరు అయింది. దీనిని కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసంలో తిరుమలరెడ్డి సతీమణికి మంగళవారం అందజేశారు. వీరి వెంట డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ నేత అడపాల మోహన్‌కృష్ణ తదితరులు ఉన్నారు.

### మొలకను బట్టి విత్తనం వేయాలి

• ఏడీఏ మారుతిదేవి



మాట్లాడుతున్న ఏడీఏ మారుతిదేవి

కొడవలూరు : రైతులు మొలక శాతం బట్టి వరి విత్తనం వేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సి.మారుతిదేవి సూచించారు. ఆత్మ సౌజన్యంతో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని యల్లాయపాళెం, గండవరం, వెంకన్నపురం, గుండాలమ్మపాళెం ఆర్బీకేల్లో రైతులకు మంగళవారం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా వచ్చిన ఆమె మాట్లాడుతూ నీటి లభ్యతను బట్టి రైతులు నార్లు పోసుకోవాలని చెప్పారు. నవంబర్ 15వ తేదీపైన నార్లు పోసుకుంటే అనుకూలంగా ఉంటుందన్నారు. ఆర్ఎన్ఆర్ 15048, ఎన్ఎల్ఆర్ 34449 రకాలు రబీకి అనుకూలిస్తాయని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎస్.లోకేష్‌బాబు మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా జీవన ఎరువులు వాడుకోవాలన్నారు. ఎరువుల యాజమాన్యం, కలుపు యాజమాన్యం గురించి ఏడీఏ జి.లక్ష్మీమాధవి తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏఓ జి.మధురిమ, మండల ఏఓ లక్ష్మి, వీఏఏలు విష్ణుప్రియ, కవిత, మహేష్, లిఖిత, రైతులు పాల్గొన్నారు.

### చేనేతలు ఐక్యంగా ఉండాలి



పల్లెబాట కార్యక్రమం నిర్వహిస్తున్న చేనేతలు

ఇందుకూరుపేట : చేనేతలు ఐక్యంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ చేనేత ఉద్యోగులు, వృత్తి నిపుణుల సంక్షేమ సంఘం(ఏపీ డబ్ల్యూఈపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శేషయ్యనేత అన్నారు. చేనేత పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొరుటూరు గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన సమస్యలను పరిష్కరించుకునేందుకు అందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బడతల ప్రభాకర్, ఉపాధ్యక్షులు గన్నే నాగేంద్ర, డాక్టర్ పేరిశెట్ల శివకుమార్, కౌన్సిల్ సభ్యులు పల్లా మాలకొండయ్య, జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు బడతల కోటేశ్వరరావు, కోవూరు నియోజకవర్గ జాయింట్ సెక్రటరీ కోడూరు శివకుమార్ పాల్గొన్నారు.

### నేడు కోవూరులో ఎమ్మెల్యే ప్రసన్న పర్యటన

కోవూరు : మండల పరిధిలో పలు అభివృద్ధి పనులను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం ప్రారంభిస్తారని డీసీఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి మంగళవారం తెలిపారు. తొలుత స్థానిక పాఠశాల ఆవరణలో ఆర్వో ప్లాంట్‌ను, అదనపు తరగతి గదిని ప్రారంభిస్తారని, అనంతరం కోవూరు సీహెచ్‌సీలో బ్లడ్ బ్యాంక్ ఫ్రీజర్‌ను ప్రారంభిస్తారని తెలియజేశారు.

### మెనూ తప్పనిసరిగా పాటించాలి

• ఏఎస్‌డబ్ల్యూఓ నరసింహారెడ్డి

మనుబోలు : వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, మెనూ పాటించని వార్డెన్లపై చర్యలు తప్పవని ఏఎస్‌డబ్ల్యూఓ నరసింహారెడ్డి అన్నారు. మనుబోలు మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ బాలుర వసతిగృహాన్ని సోమవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థులు ఎలా చదువుతున్నారో ఆరా తీశారు. ఎఫ్ఏ-2లో మార్కులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. బాగా చదివి హాస్టల్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వసతిగృహంలో విద్యార్థుల సంఖ్య పెంచాలని వార్డెన్ సుధాకర్‌కు సూచించారు.

# ప్రజారోగ్యానికి ఆరోగ్య సురక్షతో భరోసా

• అదనపు డీఎంహెచ్ఓ ఖాదర్‌వలి
• జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన



కొడవలూరు : ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న అదనపు డీఎంహెచ్ఓ ఖాదర్‌వలి

కొడవలూరు : ప్రజల ఆరోగ్యాలకు జగనన్న ఆరోగ్య సురక్షతో రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని అదనపు డీఎంహెచ్ఓ ఖాదర్‌వలి స్పష్టం చేశారు. మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య సురక్ష శిబిరాలను పెద్ద సంఖ్యలో ప్రజలు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఎక్కడి శిబిరానికి వెళ్లినా వందలాదిగా వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమం పేదల పాలిట వరం లాంటిదని అభివర్ణించారు. దీని ద్వారా ఎంతో మంది అనారోగ్య సమస్యలను నయం చేసుకుని ఆరోగ్యవంతులుగా జీవించేందుకు వెసులుబాటు కలిగిందని పేర్కొన్నారు. కీళ్లు, ఎముకుల వైద్య నిపుణుడు ప్రదీప్, కంటి వైద్య నిపుణురాలు కీర్తిక, కొడవలూరు పీహెచ్‌సీ వైద్యులు ఎం.రామకృష్ణ, జి.బాలచంద్రబాబు, యల్లాయపాళెం పీహెచ్‌సీ వైద్యురాలు లత పాల్గొని, 416 మందికి వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, పంచాయతీ కార్యదర్శులు జి.జాలయ్య, శివకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండా శ్రీనివాసులురెడ్డి, ఎస్.మాణిక్యరావు, జి.జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

**ప్రభగిరిపట్నంలో..**

పొదలకూరు : మండలంలోని ప్రభగిరిపట్నం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను మంగళవారం నిర్వహించారు. మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు పర్యవేక్షణలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. హెల్ప్ డెస్క్ ద్వారా క్యాంపునకు వచ్చిన రోగులను వలంటీర్లు, సిబ్బంది వైద్యనిపుణుల వద్దకు తీసుకెళ్లారు. సర్వేలో అందజేసిన టోకెన్ల ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శిబిరంలో సీహెచ్‌సీ వైద్యనిపుణులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

**కుటుంబాల్లో సంపూర్ణ ఆరోగ్యం**

ముత్తుకూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి పేద కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు బండెల వెంకటరమణయ్య అన్నారు. మండలంలోని బ్రహ్మదేవి-2 సచివాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొని, ప్రసంగించారు. టోకెన్ తీసుకున్న వారందరూ వైద్య పరీక్షలు చేయించుకుని, మందులు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం 286 మందికి వైద్య నిపుణులు రోహిణి, సునీల్‌కుమార్, హర్షిత తదితరులు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కట్టా సుబ్రహ్మణ్యం, షేక్ జమీల్, బషీర్, షేక్ మస్తాన్, సూపరింటెండెంట్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

**పార్లపల్లిలో..**

విడవలూరు : మండలంలోని పార్లపల్లి ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను మంగళవారం నిర్వహించారు. ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు, తహసీల్దార్ హమీద్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో స్పెషల్ డాక్టర్లు అమర్‌నాథ్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కరుణాకర్, వెంకట్, మౌనిక పాల్గొని, దాదాపు 400 మంది వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు పూండ్ల అచ్యుత్‌కుమార్‌రెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పేదల ఆరోగ్యమే లక్ష్యం**

మనుబోలు : పేదల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీపీ గుండాల వజ్రమ్మ అన్నారు. మండలంలోని కట్టువపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ప్రజల చెంతకే వైద్యసేవలను తీసుకొచ్చేందుకే ప్రభుత్వం ఆరోగ్య సురక్ష శిబిరాలను ఏర్పాటు చేస్తోందని, దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యులు సుబ్బరాజు, గేయ పూజిత, ఆమని, లక్ష్మీనారాయణ రోగులను పరీక్షించి మందులు అందజేశారు. సర్పంచ్‌లు వెంకటరమణయ్య, భారతమ్మ, మండల ఉపాధ్యక్షురాలు గుండాల శిరీష, వైఎస్సార్‌సీపీ నేతలు గుండాల ఆదినారాయణ, జానకిరామిరెడ్డి పాల్గొన్నారు.

**ఇంటి వద్దకే వైద్యం**

ఇందుకూరుపేట : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్యం అందుతోందని ఇందుకూరుపేట కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని గంగపట్నంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. అనంతరం డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పంబాల జనార్దన్‌రెడ్డి, వేణుంబాక మహీధర్‌రెడ్డి, పెనుబల్లి హనుమంతరావు నాయుడు, దండిగుంట ఫణీంద్రనాయుడు, షేక్ షబ్బీర్ పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది



మనుబోలు : సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ వజ్రమ్మ తదితరులు

**ఉచిత వైద్యసేవలు**

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు ఉచిత వైద్యసేవలు అందించడంతో పాటు ఉచితంగా మందులను అందజేస్తున్నట్లు రెడ్డిపాళెం సర్పంచ్ పత్తి వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని మునులపూడి ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దాదాపు 179 రకాల మందులను ఉచితంగా అందిస్తున్నారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్యామ్, తహసీల్దార్ సుధీర్ పాల్గొన్నారు.



పొదలకూరు : కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్



ఇందుకూరుపేట : మెడికల్ కిట్‌ను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



పొదలకూరు : వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యనిపుణుడు



ముత్తుకూరు : పేదలకు మందుల కిట్‌ను అందజేస్తున్న అధికారులు

### నేడు తోడేరులో జగనన్న ఆరోగ్య సురక్ష

పొదలకూరు : మండలంలోని తోడేరు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేస్తున్నట్లు వైద్యాధికారి నరసింహారావు మంగళవారం తెలిపారు. నిపుణులైన వైద్యులు శిబిరంలో పాల్గొంటారని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

### విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పొదలకూరు : పట్టణంలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏడీఈ బి.సురేంద్రబాబు మంగళవారం తెలిపారు. పట్టణంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాలను సరిచేస్తున్నామని, దీనివల్ల విద్యుత్ సరఫరాను నిలిపివేయాల్సి వస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

### భూముల పరిశీలన

పొదలకూరు : మండలంలోని వావింటపర్తి గ్రామ భూములను జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ పరిశీలించారు. ఈ గ్రామానికి చెందిన వ్యక్తి భూ వివాదంలో మానవ హక్కుల కోర్టును ఆశ్రయించడంతో జేసీ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు గ్రామానికి వచ్చారు. జేసీ వెంట తహసీల్దార్ కె.వీరవసంతరావు కూడా ఉన్నారు.

### మానసిక వికలాంగుల కేంద్రంలో అన్నదానం



వెంకటాచలం : మండల కేంద్రంలోని సెయింట్ జ్యూడ్స్ మానసిక వికలాంగుల కేంద్రంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళేనికి చెందిన సురేంద్రరెడ్డి, ప్రసూనమ్మ దంపతుల కుమారుడు సుమంత్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని వారు అన్నదానం చేశారు. అనంతరం మానసిక వికలాంగులకు అవసరమైన కాస్మోటిక్స్, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

## మాదక ద్రవ్యాలతో ముప్పు తప్పదు

• సెబ్ సీఐ బాలకృష్ణ



బ్రహ్మదేవిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐ బాలకృష్ణ

ముత్తుకూరు : మాదక ద్రవ్యాల వాడకం వల్ల ముప్పు తప్పదని, వాటికి దూరంగా ఉండాలని సెబ్ సీఐ బాలకృష్ణ తెలిపారు. బ్రహ్మదేవిలోని ఓ ప్రయివేటు కళాశాలలో మంగళవారం మాదక ద్రవ్యాల వినియోగంపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే అనేక అనర్థాలు జరగడమే కాకుండా విలువైన జీవితం అంధకారం అవుతుందన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని విద్యార్థులను కోరారు. ఎటువంటి తప్పులు చేయబోమంటూ ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల అధ్యాపకులు, మహిళా పోలీసులు ఉషాలక్ష్మి, కామేశ్వరి పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

• ఇద్దరికి గాయాలు



ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

మనుబోలు : ఇసుక ట్రాక్టర్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని పోర్ట్ క్రాస్‌రోడ్డు సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వెంకటాచలం నుంచి వెందోడుకు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ పంక్చర్ కావడంతో పోర్టు క్రాస్‌రోడ్డు సమీపంలో హైవే పక్కన ఆగి ఉంది. అదే మార్గంలో వస్తున్న లారీ అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొంది. వెనుకనే వస్తున్న ద్విచక్ర వాహనం లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ కిట్టు, ద్విచక్ర వాహనదారుడు వికాస్‌కు గాయాలయ్యాయి. ప్రమాదం కారణంగా కొద్దిసేపు హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు గుమ్మళ్లదిబ్బ విద్యార్థులు



ప్రతిభ చాటిన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కోవూరు : నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గత నెలలో జరిగిన ఆటల పోటీల్లో కోవూరు మండలం గుమ్మళ్లదిబ్బ ఉన్నత పాఠశాలకు చెందిన దాదాపు 30 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఖోఖో అండర్-17 విభాగంలో వై.లక్ష్మీనరసింహ. పి.కీర్తన, కబడ్డీ అండర్-17 బాలికల విభాగంలో సీహెచ్ శ్రీవల్లిక, సాఫ్ట్‌బాల్ అండర్-14 విభాగంలో ఇర్ఫాన్, పవన్, ఆశ్రిత, పి.దీక్ష, ఎస్.మహిత, సీనియర్ సాఫ్ట్‌బాల్ అండర్-17 విభాగంలో కె.వైష్ణవి, బేస్‌బాల్ సీనియర్ విభాగంలో పి.వరుణ్, జి.వెంకట రూపేష్, ఎస్.భానుప్రకాష్, ఎస్.దీపికా జ్యాలా, కె.వైష్ణవి ఎంపికయ్యారు. అలాగే పలు విభాగాల్లో గమ్మళ్లదిబ్బ విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రతిభ చాటిన విద్యార్థులను హెచ్‌ఎం ఇందిరాదేవి, పాఠశాల విద్యాకమిటీ చైర్‌పర్సన్ స్వప్న మంగళవారం పాఠశాలలో అభినందించారు. వీరితో పాటు పీడీ మధుసూదనరావు, పీఈటీ టి.అజయ్‌లకు అభినందనలు తెలిపారు.

# పేదల సొంతింటి కల సాకారం

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



లబ్ధిదారుకు ఇంటి పట్టాను అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : రాష్ట్రంలో అర్హత కలిగిన పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. సర్వేపల్లిలోని జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా 603 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఆయన మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ గత చంద్రబాబు పాలనలో ఇళ్ల స్థలాల కోసం అధికారులు, నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పేదల సొంతింటి కల నెరవేరలేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలో జగనన్న కాలనీల పేరుతో లేఅవుట్లను ఏర్పాటు చేసి అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఇంటి స్థలంతో పాటు, ఇళ్లను నిర్మించి ఇస్తున్నట్లు చెప్పారు. దీనిని అడ్డుకునేందుకు ఎన్ని కుట్రలు చేసినా లెక్కచేయకుండా సర్వేపల్లి నియోజకవర్గంలో ఇళ్ల స్థలాలను పంపిణీ చేశామన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో గతంలో ఎవరికీ సాధ్యం కాని రీతిలో ఇళ్ల పట్టాలు, పింఛన్లను పంపిణీ చేశామని వివరించారు. గతంలో ఏ ఎమ్మెల్యేకు సాధ్యం కాని విధంగా కోట్లాది రూపాయలు వెచ్చించి సీసీరోడ్లు, సైడు కాలువలు, తాగునీటి పథకాలు నిర్మించినట్లు తెలియజేశారు. రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఏళ్ల తరబడి పేదలు సాగు చేసుకునే భూములకు సంబంధించి 1,884 మంది రైతులకు 2,126 ఎకరాలకు త్వరలో పట్టాలు పంపిణీ చేసి రైతుల కళ్లలో ఆనందం నింపబోతున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా సర్వేపల్లి, తిక్కవరప్పాడు పంచాయతీ పరిధిలో రూ.1.21 కోట్లతో నిర్మించిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, కొనిదెన విజయభాస్కర్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మురళీరెడ్డి, తిక్కవరప్పాడు సర్పంచ్ చిరంజీవి, పార్టీ నేతలు మంచు వెంకటేశ్వర్లునాయుడు, నలగర్ల నరసింహారావు, గొట్టిపాటి పద్మయ్యనాయుడు, మంచు శ్రీనివాసులునాయుడు, నలగర్ల రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### అధికారుల నిర్లక్ష్యం.. ఆక్వారైతుకు నష్టం



చనిపోయిన రొయ్యలను పరిశీలిస్తున్న రైతులు

విడవలూరు : ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం వల్ల ఓ ఆక్వారైతు ఆశలు ఆవిరయ్యాయి. పొన్నపూడి పెద్దపాళేనికి చెందిన ఆక్వా రైతు అప్పంగారి రవిచంద్ర మంగళవారం తన ఆవేదన వెలిబుచ్చాడు. తాను 2.50 ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నానని, ట్రాన్స్‌కోకు ఎలాంటి బకాయి లేనప్పటికీ ఎలాంటి సమాచారం లేకుండా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో రొయ్యలకు ఆక్సిజన్ అందక చనిపోయినట్లు వాపోయాడు. మరో వారం రోజుల్లో పంట చేతికి అందే సమయంలో ఇలా చేయడం వల్ల తనకు రూ.23 లక్షల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా విద్యుత్ సరఫరా ఎలా నిలిపివేస్తారంటూ నిలదీశాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి

పొదలకూరు : ప్రభుత్వ పథకాలను గ్రామాల్లోని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కే.సుబ్బరాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ శాఖలవారీగా అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఏర్పాటు చేస్తోందని, వాటి ఆవశ్యకతను వివరించాల్సిందిగా సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉంటే సభ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండలాభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతున్నట్లు చెప్పారు. ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి మాట్లాడుతూ మంత్రి కాకాణి ఆదేశాల మేరకు గ్రామాల్లో శ్మశాన స్థలాల్లో విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి స్తంభాల నిర్మాణం చేపట్టాల్సిందిగా విద్యుత్ ఏఈ శ్రీకాంత్‌కు సూచించారు. సమావేశంలో డీటీ సాయి గణేష్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, ఇరిగేషన్, హౌసింగ్ ఏఈలు కసనానాయక్, ప్రసాద్, రవికుమార్‌రెడ్డి, ఏపీఓ మధుసూదన్, ఏఓ వాసు, ఏపీఎం రోజ్‌మేరి, వైద్యారోగ్యశాఖ ఉద్యోగి శివప్రసాద్ వారి శాఖల పనితీరు గురించి వివరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, వైస్ ఎంపీపీ సోమా అరుణ, సర్పంచ్ చిట్టెమ్మ, ఎంపీటీసీలు షాకీరాబేగం, జి.లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు, కె.రామిరెడ్డి పాల్గొన్నారు.

### పోషకాహారం పంపిణీ



కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన బలవర్ధక పదార్థాలను ప్రదర్శించారు. శిబిరానికి వచ్చిన వారికి వాటి ప్రయోజనాలను తెలియజేశారు. అనంతరం ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయమ్మ, రాజమ్మ, సునీత, సుదర్శన, భారతి, మంజుల, ప్రియదర్శిని పాల్గొన్నారు.